పస్తులుంటున్నారు..

- జూనియర్ కళాశాలలో కలగానే మధ్యాహ్న భోజనం
- ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు
- సమయం లేక టిఫిన్సు తెచ్చుకోలేని వైనం


బోథ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

బోథ్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం కలగానే మారింది. పాఠశాలలో మాదిరిగా కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభిస్తామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. నాలుగేళ్ల ఆ ప్రకటన హామీకే పరిమితమైంది. దూరప్రాంతాల నుంచి విద్యార్థులు ఉదయం 9 గంటలకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చేరుతున్నారు. దీంతో ఇళ్లలో టిఫిన్ సిద్ధం కాకపోవడంతో తెచ్చుకోలేకపోతున్నామని వారు వాపోతున్నారు. మధ్యాహ్న సమయంలో ఆకలితో అలమటిస్తున్నారు. కొందరు ఇళ్లలో టిఫిన్లు తీసుకువస్తుండగా, మరికొందరు బేకరీల్లో అల్పాహారం చేస్తున్నారు. ఇంకొందరు మధ్యాహ్న వేళ ఇంటికి వెళ్లి తిరిగి తరగతులకు రావడం లేదు. ఈ విద్యాసంవత్సరంలో మధ్యాహ్నభోజన పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

జిల్లాలో..
జిల్లాలో 19,587 మంది విద్యార్థులు ఇంటర్ విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 38 జూనియర్ కళాశాలల ఉండగా, అందులో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్(జూనియర్ కళాశాల)లు 6, ప్రైవేట్ కళాశాలలు 19 ఉన్నాయి. ఇవి..జిల్లా కేంద్రం, మండల కేంద్రాల్లో ఉన్నాయి.

మధ్యాహ్నం ఆకలిగా ఉంటుంది



నేను బోథ్ మండలం ధన్నూర్(బి) నుంచి కళాశాలకు వస్తాను. మధ్యాహ్నం ఆకలిగా ఉంటుంది. ఇంటి వద్ద ఉదయం భోజనం సిద్ధం కాదు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేసి విద్యార్థుల ఆకలి తీర్చాలి.
– యు.సంజన, ఇంటర్ ఎంపీసీ, ఫస్టియర్

ఆకలి వేస్తోంది



మాది బోథ్ మండలం రాంనగర్ స్వగ్రామం. 12 కి.మీ నుంచి బోథ్ జూనియర్ కళాశాలకు వచ్చి చదువుతున్నా. ఉదయం 8 గంటలకే బయల్దేరి వెళ్తున్నా. ఉదయం ఇంట్లో భోజనం సిద్ధం కాదు. కళాశాలలో మధ్యాహ్న సమయంలో ఆకలి వేస్తోంది. ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి.
– ఎస్.గజానంద్, ఇంటర్ ఎంపీసీ, ఫస్టియర్

టిఫిన్‌కు సమయం లేదు



మాది బోథ్ మండలం కౌఠ(బి) స్వగ్రామం. ప్రతిరోజు ఉదయం 9 గంటలకు కళాశాలకు వస్తాను. ఉదయం టిఫిన్ తీసుకురావడానికి సమయం సరిపోదు. ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నం భోజనం పథకాన్ని అమలు చేయాలి.
– ఎస్.అంకిత, ఇంటర్ ఎంపీసీ, ఫస్టియర్

క్లుప్తంగా

కష్టపడి చదవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ప్రయోజకులు కావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బీఎడ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. సమాజంలో చదువుతోనే గుర్తింపు లభిస్తుందన్నారు. ఉపాధ్యాయులు వారికి సులభపద్ధతిలో బోధించాలన్నారు. కళాశాల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, అధ్యాపకులు, విద్యార్థులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం
చాందూరి పంచాయతీ పరిధి నీలగొంది గ్రామంలో రూ.25 లక్షల నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీల పనులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభించారు. నీలగొంది ప్రజలతో తనకు విడదీయరాని బంధం ఉందన్నారు. తన కష్టకాలంలో ప్రజలు అన్ని విధాలుగా అండగా నిలిచారని వారికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. అదే విధంగా అల్లంపెల్లికి రోడ్డు సౌకర్యంకల్పించాలని కోరుతూ గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. నాయకులు ఖయ్యూం, చంద్రయ్య,ఎక్బాల్, కలీం, ఇర్ఫాన్, రాజేశ్ గ్రామస్తుల తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


అడేగామ(బి)లో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడిన మండల కేంద్రానికి చెందిన పండుగ చంద్రశేఖర్‌ను ఆయన నివాసంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం పరామర్శించారు. అలాగే కొప్పుల గంగాధర్ తండ్రి లస్మన్నతోపాటు డాక్టర్ ఇస్లాముద్దీన్ మృతిచెందగా బాధిత కుటుంబాలను ఓదార్చారు. ఆయన వెంట మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ సర్పంచ్ పెంట రమణ, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, సురేందర్, బాబులాల్, గులాబ్, సోమేశ్ ఉన్నారు.


ఇచ్చోడ: మండలంలోని అడేగామ(బి) గ్రామానికి చెందిన అబ్బసాబ్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానిన ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు కడమంచి భీముడు రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఆయన ఇంటికెళ్లి ఓదార్చారు. నాయకులు కృష్ణారెడ్డి, పాండు, నర్వడే రమేశ్, దేవేందర్‌రెడ్డి, సజన్‌లాల్, గణేశ్, అడేగామ(బి) మాజీ సర్పంచ్ సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని డీసీఈబీ బ్యాంక్ ముద్రించిన క్యాలెండర్‌ను డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025లో రైతులకు బ్యాంక్ సేవలు మరింత చేరువయ్యేలా చూస్తున్నామని అన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే తక్కువ వడ్డీ అవుతుందని తెలిపారు. డీసీసీబీ డైరెక్టర్ దుర్గం రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

ట్రస్మా జిల్లా నూతన కార్యవర్గం


ట్రస్మా నూతన కార్యవర్గ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) జిల్లా నూతన కార్యవర్గాన్ని పట్టణంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రమోద్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా గణేశ్, దేవేందర్‌రెడ్డి, వెంకట్‌రావు, శ్యామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అనిల్ రాథోడ్, సంయుక్త కార్యదర్శులుగా కార్తీక్, జీవన్‌రెడ్డి, సదాశివరెడ్డి, కోశాధికారిగా శుద్ధోధన్ ఎన్నికయ్యారు.

అక్రిడిటేషన్ గడువు పొడిగింపు

కై లాస్‌నగర్: జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువును ప్రభుత్వం మరో మూడు నెలల పాటు పొడిగించింది. కార్డుల కాలపరిమితి ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో వచ్చే ఏడాది మార్చి 31వరకు పొడిగిస్తూ సమాచారశాఖ రాష్ట్ర ప్రత్యేక కమిషనర్ ఎస్.హరీష్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలి


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని, రాజకీయాలు ఎన్నికల సమయంలో మాత్రమేనని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జైనథ్ మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. 58 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరి సహాయం లేకుండా భవిష్యత్తులో ఆడపిల్లల పెళ్లి చేసే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. దీని కోసం ప్రభుత్వాలు అనేక విధాలుగా ప్రజలకు సహకారం అందించాలన్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై ప్రస్తావించినట్లు తెలిపారు.అధికారులు,బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేరడిగొండ/బజార్‌హత్నూర్: బజార్‌హత్నూర్ మండలం దేగామ గ్రామానికి చెందిన ప్రకాశ్‌కు సీఎం సహాయ నిధి ఆర్థికసాయం మంజూరైంది. నేరడిగొండ మండలంలోని తన క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మంగళవారం రూ.55వేల చెక్కును ప్రకాశ్‌కు అందజేశారు. సీఎం సహాయ నిధి ద్వారా పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. బజార్‌హత్నూర్ మండల అధ్యక్షుడు సామాన్‌పెల్లి శేఖర్, బోథ్ మాజీ ఎంపీటీసీలు కుర్మే మహేందర్, ఉమేష్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పోతారెడ్డి, నేరడిగొండ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హీరాసింగ్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సౌజన్య

కై లాస్‌నగర్: మహిళల కోసం అనేక చట్టాలున్నా వాటిపై అవగాహన లేక చాలామంది న్యాయ సాయం పొందలేకపోతున్నారని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం, గృహహింస తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి న్యాయ సాయం కావాలన్న డీఎల్ఎస్ఏ ద్వారా ఉచితంగా అందిస్తామని సంస్థను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్, మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ యశోద తదితరులున్నారు.

రాయిసెంటర్ నూతన కమిటీ


ఎన్నికైన సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చించుఘాట్ గ్రామంలో మంగళవారం 36 గ్రామాల పటేళ్లు, గట్యాల్, మహాజన్, దేవరి, పెద్దలు చించుఘాట్ గ్రామ పటేల్ కుమ్ర రాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో 36 గ్రామాలను కలిపి చించుఘాట్ గ్రామంలో నూతన రాయిసెంటర్ కమిటీని ఎన్నుకున్నారు. సార్మేడి ఆత్రం పరశురాం, ఉప సార్మేడిలుగా మెస్రం తులసీరాం, మంగరపు రమేశ్, గీతాదార్ మర్సకోల కేశవరావు, ఖజనదార్‌గా మడవి శ్యామ్‌రావ్, రాయిపటేల్ ఆత్రం గంగారాం, సలహాదారుగా ఆత్రం మల్కు, కుమ్ర తెలంగరావ్, కాత్లే మారుతి, కుమ్ర రాములు, సలాలం జంగుపటేల్, స్మేడికి రాము, మర్సుకోల భూమన్న, కార్యవర్గ సభ్యులుగా మెస్రం రవి, తొడసం గంగారాం, మర్సుకోల సురేష్, చహకటటి పురుషోత్తం ఎన్నికయ్యారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి


సర్వే తీరును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కైలాస్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ సీవీ ఎన్.రాజు సర్వేయర్లను ఆదేశించారు. పట్టణంలోని విద్యానగర్, భుక్తాపూర్, రిక్షాకాలనీల్లో మొబైల్ యాప్ ద్వారా జరుగుతున్న ఇందిరమ్మ దరఖాస్తుదారుల వివరాల నమోదును మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. దరఖాస్తుదారులకు సంబంధించి నిబంధనల మేరకు అన్ని వివరాలను పక్కాగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్ వెనుగంటి ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

31లోపు ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తిచేయాలి
బేల: ఈనెల 31లోపు ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలని ఎంపీవో మహేశ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని దహెగాం గ్రామంలో ఇంటింటా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి అర్హులను గుర్తించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రత్నాకర్, కారోబార్ ఉన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

- కలెక్టరేట్ ఎదుట ధర్నా
- బర్తరఫ్ చేయాలని నేతల డిమాండ్


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు మండిపడ్డాయి. టీపీసీసీ పిలుపు మేరకు మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. బాబా సాహెబ్ చిత్రపటాలతో నిరసన తెలిపిన నాయకులు అమిత్‌షాకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలు తన అహంకారానికి నిదర్శనమన్నారు. దళితవర్గానికి చెందిన రాజ్యాంగ నిర్మాతను గౌరవించని సంస్కృతి బీజేపీ నాయకులదేనని ఎద్దేవా చేశారు. అమిత్‌షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ దేశంలో అన్ని కులాలు, మతాలు సమాన హక్కులతో ప్రజాస్వామ్యయుతంగా మనగలుగుతున్నాయంటే అంబేడ్కర్ రాసిన రాజ్యంగం వల్లనేనని గుర్తు చేశారు. అమిత్ షా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. దేశ ప్రజలకు ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు భూపెల్లి శ్రీధర్, గోక గణేశ్‌రెడ్డి, అల్లూరి అశోక్‌రెడ్డి, బొరంచు శ్రీకాంత్‌రెడ్డి, అడ్డి రూకేష్‌రెడ్డి, గిమ్మ సంతోష్‌రావు, లోక ప్రవీణ్‌రెడ్డి, కె.పరమేశ్వర్, రూపేష్‌రెడ్డి, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలతోనే కాలయాపన

తలమడుగు: ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయలేక సర్వేల పేరిట కాలయాపన చేస్తోందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని బరంపూర్ గ్రామంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేవలం సర్వేల పేరిట ప్రజలను మోసం చేయడమే తప్ప సంవత్సర కాలంలో చేసింది ఏమీ లేదన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను బీఆర్‌ఎస్ నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం బరంపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు, బీఆర్‌ఎస్ నేత మాడూరి మల్లేశ్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల కన్వీనర్ వెంకటేశ్, జిల్లా నాయకులు కిరణ్ కుమార్, ముడుపు కేదరేశ్వర్‌రెడ్డి, రమాకాంత్, రంజిత్‌రెడ్డి, పిడుగు అభిరామ్‌రెడ్డి, ప్రకాశ్, ప్రమోద్, గజానంద్, సుదర్శన్‌రెడ్డి, నర్సింలు శాస్త్రి పాల్గొన్నారు.

సీసీఎల్ మంజూరు చేయాలని వినతి

ఆదిలాబాద్‌టౌన్: సమగ్ర కుటుంబ సర్వే విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని టీపీయూఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు డీఈవో ప్రణీతను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపీకృష్ణ, శ్రీనివాస్ తదితరులున్నారు.

ముస్తాబైన చర్చీలు


అందంగా అలంకరించిన బెతేస్థా చర్చి

ఉట్నూర్‌రూరల్: క్రిస్మస్ వేడుకలకు చర్చీలు ముస్తాబైంది. మండల కేంద్రంలోని సీఎస్ఐ, బెతెస్థా, మోరియా, సీఎస్ఐ, బిలివర్స్, కాథిలిక్, సెయింట్ పాల్, హెబ్రోన్, దంతన్‌పల్లి గ్రామంలోని యెహోవాయిరే , శ్యాంపూర్‌లోని బెతెస్థా చర్చీలను క్రైస్తవులు అందంగా అలంకరించారు. బుధవారం ఉదయం 10 గంటలకు నుంచి చర్చిలో ప్రార్థనలు నిర్వహించనున్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని హోలీ ట్రినిట్ చర్చి వద్ద పశువుల పాకతోపాటు పువ్వులు, చెట్లు, విద్యుత్ దీపాలతో భక్తులకు ఆకర్శించేలా ఏర్పాట్లు చేశారు.

పాఠశాలల్లో ముందస్తు క్రిస్మస్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులు ఏసుక్రీస్తుతోపాటు పలు వేషధారణలో ఆకట్టుకున్నారు. ఆయన జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని పస్ట్‌స్టెప్ స్కూల్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చే సిన నృత్యాలు పలువురిని అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ అనురాజ్‌రెడ్డి, కపిల్, ప్రిన్సి పాల్ బిల్‌కిస్‌ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నా రు.


వేషధారణలో విద్యార్థులు


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

బ్రిడ్జి పనుల పరిశీలన
ఇచ్చోడ: మండల కేంద్రంలోని శివాజీచౌక్‌లో నూతనంగా నిర్మించనున్న బ్రిడ్జి పనులను ఇంజినీరింగ్ అధికారులతో ఎస్సై తిరుపతి కలిసి మంగళవారం పరిశీలించారు. బ్రిడ్జి వద్ద రోడ్డుకు రెండు దిక్కులు భారీకేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. బ్రిడ్జి నిర్మాణమయ్యే వరకు వాహనాల రాకపోకలను మోచిగల్లి లేదా, సోనార్‌గల్లీల మీదుగా డైవర్షన్ చేయనున్నట్లు తెలిపారు. వాహనాల దారి మళ్లింపు సందర్భంగా రోడ్లపై పార్కింగ్ చేసే వాహనాలకు జరిమానా విధిస్తామని తెలిపారు.

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి
ఉట్నూర్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సీఆర్టీలు ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట చేపట్టిన సమ్మెకు సివిల్ సప్లై మాజీ చైర్మన్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్‌సింగ్ మంగళవారం మద్దతు తెలిపారు. నెల రోజుల్లో ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అనంతరం సీఆర్టీల భోజన సౌకర్యం కోసం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. మాజీ ఎంపీపీ జైవంత్‌రావు, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, సాజిద్ ఉన్నారు.

పీఆర్టీయూ టీఎస్ మద్దతు
ఈ సమ్మెకు పీఆర్టీయు టీఎస్ నిర్మల్ జిల్లా శాఖపక్షాన సంపూర్ణ మద్దతు తెలిపింది. జిల్లా అధ్యక్షుడు తోట నరేంద్ర బాబు, జిల్లా నాయకులు బల్సగజ్జరాం, కృష్ణారావు, రఘువేంద్ర వర్మ తదితరులు ఉన్నారు. తుడుందెబ్బ ఆధ్వర్యంలో వారికి మద్దతు తెలిపారు.

ఆడే గజేందర్‌ను కలిసిన గ్రామస్తులు
నేరడిగొండ: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను బోథ్ మండలం పార్డి(బి) గ్రామస్తులు మంగళవారం కలిశారు. మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పలు సమస్యలు ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలో నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తానన్నారు. అలాగే గజేందర్‌ను బోథ్ మండలం నక్కల్‌వాడ గ్రామస్తులు కలిసి నూతన హనుమాన్ మందిరం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. నిగిని మాజీ ఉప సర్పంచ్ సాయన్న, బోథ్ తాజా మాజీ ఎంపీటీసీ మహేందర్, యూత్ అధ్యక్షుడు పోతారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ
తాంసి: మండల కేంద్రంలో వృద్ధులు, వికలాంగులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సాయిసేవా సొసైటీ అధ్యక్షుడు దెబ్బడి అశోక్ సంస్థ తరపున గ్రామంలోని 100 మందికి పైగా వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. గ్రామపెద్దలు సుధాకర్‌యాదవ్, సంతోశ్, పోచ్చారెడ్డి, విలాస్, అశోక్ ఉన్నారు.

27న వాహనాల వేలం
ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలోని నాలుగు వాహనాలు బహిరంగ వేలం ఈనెల 27న నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు ఈఎండీ కింద పీవో ఐటీడీఏ పేరుపై డీడీ సంబంధిత బ్యాంకు ద్వారా తీయాలని పేర్కొన్నారు.

కొనసాగుతున్న నవచండీ మహాయాగం
ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) గ్రామంలో నిర్వహిస్తున్న నవ చండీ మహాయాగం భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. మంగళవారం వేద పండితుడు ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని పూజలు చేశారు. నవ చండీ మహాయాగం చేపడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. అంతకుముందు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

విజ్ఞాన విహారయాత్రకు విద్యార్థులు
బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం విజ్ఞాన విహార యాత్రకు వెళ్లారు. గుడిహత్నూర్ మండలం గులాబ్ సింగ్ ఫిల్మ్‌సిటీలో పలు ప్రదేశాలను వీక్షించారు. హెచ్ఎం రావుల శంకర్, ఉపాధ్యాయులు రాథోడ్ సవిత, స్వప్న, ప్రశాంత్, సారిక, పాఠశాల చైర్మన్ శిల్పాంజలి, వాజీద్, గంగమ్మ, గుండమ్మ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నేరడిగొండ: మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు అను ష్క, జ్యోతిలు సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం జి.అంబారావు తెలి పారు. మంచిర్యాలలో ఇటీవల జరిగిన జోనల్ స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 27న ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. పాఠశాల సిబ్బంది భీంరావు, బాపురావు, శంకర్, మదన్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తన స్వగ్రామం రాజురాలోని జగదాంబ సేవాలాల్ మహరాజ్ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయన్ను సన్మానించారు. నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్, తాంసి మాజీ వైస్ ఎంపీపీ రఘు, రాజు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899